

దోమల నివారణకు విస్తృత చర్యలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం విస్తృతంగా చర్యలు చేపట్టామని మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నగరంలో దోమల ఉత్పత్తి తగ్గించడంలో భాగంగా కార్యక్రమాలు చేపట్టారు. అల్మాస్‌పేట, అక్కయ్యపల్లి ప్రాంతాలలో ఫాగింగ్ నిర్వహించారు. పకీరుపలి, అక్కయ్య పల్లి ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేశారు. ఓంశాంతి నగర్, చౌటుపల్లి, మారుతి నగర్, నబీ కోట ప్రాంతాల్లో డీసిల్టింగ్ చేశారు. నీళ్లు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమలు ఉత్పత్తి కాకుండా ఉండటానికి ఆయిల్‌బాల్స్ వేశారు. నాగరాజు పేట, 7 రోడ్స్ ప్రాంతాల్లోని మురుగు కాల్వలో ఫాగింగ్ చేశారు. నగరపాలక సంస్థలోని అన్ని ప్రాంతాలను మలేరియా నివారణ చర్యలు చేట్టారు.

గైర్హాజరీలపై గురి!

- జంపింగులు సహా మరికొందరిపై సందేహాలు
- 48 మంది జడ్‌పిటిసి సభ్యులకు నోటీసులు
- నేడు వేంపల్లికి వైఎస్ జగన్ రాక?!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక ఆసక్తిని కలిగిస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 27న ఛైర్మన్ ఎన్నిక నిర్వహించాలని షెడ్యూలును జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా పరిషత్ అధికార యంత్రాంగం ఈనెల 23న నోటి ఫికేషన్ విడుదల చేయనుంది. ఇందులో భాగంగా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ జిల్లాలోని 50 మంది జడ్‌పిటిసి సభ్యుల్లో 48 మందికి ఛైర్మన్ ఎన్నిక నిర్వహణ విధి విధానాలను వివరిస్తూ బుధవారం నోటీసులు జారీ చేశారు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఒంటిమిట్ట జడ్‌పిటిసి సభ్యులుగా గెలిచిన మాజీ జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమరనాధరెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి రాజంపేట ఎమ్మెల్యేగా గెలిచారు. పులివెందుల జడ్‌పిటిసి మరణించిన రీత్యా రెండు స్థానాలు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇదిలాఉండగా జిల్లాలోని 48 జడ్‌పిటిసి సభ్యుల్లో ఎంతమంది ఛైర్మన్‌ఎన్నికకు హాజరవుతారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే 8 మంది జడ్‌పిటిసిలు టిడిపి వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో మరో ఐదుగురు గైర్హాజరు కావడానికి అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యం ఉత్కంఠను కలిగిస్తోంది. ఈలెక్కన సుమారు 13 మంది జిల్లా పరిషత్ సభ్యులకుతోడు మరి కొందరు గైర్హాజరైతే పరిస్థితి ఏమిటనే చర్చ నడుస్తోంది. కోరం తలెత్తే వరకు పరిస్థితి వెళ్తే ఏమిటనే తర్జన భర్జన జరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వైసిపి నాయకత్వం ఎవరెవరు గైర్హాజరవుతారు, వారిని ఛైర్మన్ ఎన్నికకు ఎలా రప్పించాలనే అంశంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా వైసిపిలోని అసం తృప్తులను ఎలా బుజ్జగించాలనే ఆలో చన చేస్తున్నట్లు తెలుస్తోంది. 2024 డిసెంబర్‌లో రాజధాని ప్రాం తమైన తాడేపల్లిలో వైఎస్‌జగన్ సమక్షంలో వైసిపి జడ్‌టిసిలు బ్రహ్మ ంగారిమఠం జడ్‌పిటిసి రామ గోవిందరెడ్డిని ఏకగ్రీ వంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. అనంతరం మాజీ ఛైర్మన్ నిర్వహించిన భారీ డిన్నర్‌లో పలువురు జడ్‌పిటిసిలకు కొంత మొత్తాన్ని సర్దుబాటు చేసినట్లు ప్రచా రంలో ఉంది. మరో ఏడాది న్నర జిల్లా పరిషత్ ఎన్నిక గడువు ఉన్న నేప థ్యంలో మరోసారి సర్దుబాటుకు అవ కాశం ఉందా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఇదిలాఉండగా వేంపల్లి జడ్‌పిటిసి కుమారుని వివాహ రిసెప్షన్‌కు శుక్రవారం వైఎస్ జగన్ హాజరయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వైసిపి నాయకత్వం జడ్‌పి ఛైర్మన్‌ఎన్నిక వ్యవ హారంపై సంప్రదించే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అధికార టిడిపి జిల్లా నాయకత్వం ఏడాదిన్నర వ్యవధిలోని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక వ్యవహారంపై ఆసక్తి చూపడం లేదనే సంగతి తెలుస్తోంది. లేనిపక్షంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక వ్యవహారం మరోలా ఉండేదనడంలో సందేహం లేదు.



రాయలసీమ సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి

రాయలసీమ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి డిమాండ్ చేశారు. మిషన్ రాయలసీమను అమలు చేయాలని కోరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి తాగునీరు, సాగునీరు, విద్య, ఆరోగ్య రంగాలు, ఉపాధి, వ్యవసాయం, పండ్ల తోటల సాగు వంటి కీలక రంగాలకు తక్షణ ప్రాధాన్యత ఇవ్వాలని చేశారు.రాయలసీమను విత్తన రాజధానిగా ప్రకటించి, కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, కియా, ఇసుజు వంటి ప్రధాన కంపెనీలను ఆకర్షించి రాయలసీమను ఆటోమొబైల్ హబ్‌గా మార్చాలని సూచించారు. రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను రాయలసీమ ప్రధాన నగరా లకు అనుసంధానం చేయడం ద్వారా పారిశ్రామిక క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 'మిషన్ రాయలసీమ'ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి తక్షణ చర్యలు తీసుకుని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చెందిన ప్రాంతంగా మార్చాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పెద్దపీరయ్యస్వామి ఆరాధనోత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప సిటీ : పెద్దపీరయ్యస్వామి ఆరాధనోత్సవాలను జయప్రదం చేయాలని మఠాధిపతి సిద్ధేశ్వరయ్య, కార్యదర్శి రసూల్, ప్రచార కార్యదర్శి డి. చెన్నకేశవులు పిలుపునిచ్చారు. గురువారం ప్రచార కార్యదర్శి చెన్నకే శవులు మాట్లాడుతూ ఈనెల 30న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బి.మఠం మండల పరిధిలోని సిద్ధయ్యస్వామి ప్రార్థ నాలయంలో ఆరాధ నోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరాధనోత్సవాలకు తమిళనాడు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి పలువురు యాత్రికులు హాజరవు తున్నారన్నారు. ఇటువంటి యాత్రికుల సౌకర్యార్థం తమవంతు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మంగారి ప్రియశిష్యులైన సిద్ధయ్య, ఆయన కుమారుడు పెద్దపీరయ్య జీవ సమాధులను సందర్శించుకుని వెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

నేడు దూదేకుల భవన్‌లో ఇఫ్తార్

ప్రజాశక్తి - కడప సిటీ : కడప నగరంలోని ఎర్రముక్కపల్లి దూదేకుల భవన్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశామని నూర్‌బాషా-దూదేకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఆయిల్‌మిల్ ఓబులేసు, అధ్యక్షులు ఖాదరయ్య, అజ్మ తుల్లా, హుసేనయ్య పేర్కొన్నారు. గురువారం ప్రముఖ వ్యాపారవేత్త ఆయిల్‌మిల్ ఓబులేసు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుని ఉపవాసాలు ఉంటున్న పలువురు దూదేకులు, ముస్లి మ్ సోదరులకు తమ వంతు తోడ్పాటును అందిస్తున్నామన్నారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు ఇఫ్తార్ ప్రారంభవుతుందని, ఉపవాస దీక్షల్లో ఉంటున్న వారు హాజరై నమాజ్ నిర్వహణ అనంతరం ఇఫ్తార్ విందు ఆస్వాదించాలని కోరుతున్నట్లు తెలి పారు.

'అగ్నివీర్'కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కడప : ఆర్మీ డైరెక్టర్ రిక్రూట్మెంట్ గుంటూరు వారి ఆధ్వర్యంలో అగ్నిపథ్ స్కీం కింద అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్స్ సిఇఒ సాయి గ్రేస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్‌లోని వివిధ కేటగిరీలైన 'అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/ స్టోర్ కీపర్, అగ్నివీర్ టెక్నికల్, ట్రేడ్స్ మెన్'లో నియామకాల కోసం ఆన్‌లైన్ www.joinindianarmy.nic.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సంవత్సరం మొట్ట మొదటిసారిగా ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సిఇఇ) ను తెలుగులో నిర్వహిస్తున్నారన్నారు. ఎన్‌సిసి-ఎ,బి,సి సర్టిఫికెట్లు ఉన్న అభ్యర్థులకు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీ అభ్యర్థులకు, ఐటిఐ డిప్లొమా వారికి అదనపు మార్కులు జతచేస్తారని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 10 లోగా వెబ్ సైట్ నమోదు చేసుకోవాలని తెలిపారు.

శిల్పారామం ఎఒగా కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప శిల్పరామం ఏవోగా కృష్ణ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం నుంచి కడపకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప శిల్పారామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలు అధిక సంఖ్యలో శిల్పారామాన్ని సందర్శించాలని కోరారు.





మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

పిల్లల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండల పరిధిలోని మూల వంక ఉర్దూ పాఠశాలలో గురువారం అంగన్వాడీ కార్యకర్తలకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడీ 'టీచర్లకు పోషణభి. పడాయిభి' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20 గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బిడ్డ పుట్టినప్పుడు నుంచి ఆరేళ్లలోపు లోపు పిల్లలకు ఆరోగ్యం, విద్య అనేది ఎంతో అవసరమన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 3 సంవత్సరాలు లోపు పిల్లలకు 'నావచేత' అనే 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలకు 'ఆధార్ షీలా' అనే కార్యక్రమం ద్వారా ఐదు రకాల అభివృద్ధిల గురించి అంగన్వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారని చెప్పారు. మండలంలోని అంగన్వాడీ టీచర్లను రెండు గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఎ-1 యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిజిహెచ్ రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులను అకారణంగా తొలగించిన ఎ-1 యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, పి వెంకటసుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జీవో నంబర్ 549 ప్రకారం రూ.16,000 వేతనం ఇవ్వాలని జిల్లా అధికారులకు,డిప్యూటీ కలెక్టర్‌కు, జి జి హెచ్ వారికి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ స్పందించకపోవడం బాధాకరమని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ తదితర కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అడిగితే తీసేయడం, తొలగించడం, దాడి చేస్తామని బెదిరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రభుత్వ నామ్స్ ప్రకారం వేతనాలు అడిగితే తొలగించడం సరైంది కాదని తెలిపారు. దీనికి అనేక కారణాలు చెప్పడం దారుణమని పేర్కొన్నారు. కార్మికులను వ్యంగంగా మాట్లాడిన, ఇబ్బంది పెట్టిన, ఏం చేసినా వారిని రక్షించడమే పనిగా యాజమాన్యం ఉన్నదని తెలిపారు. ఇప్పటికైనా పిఎఫ్ ఇఎస్ఐ కనీస వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ దృష్టికి, మంత్రికి, ప్రిన్సిపల్ సెక్రెటరీకి, డిప్యూటీ కలెక్టర్‌కి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

జిల్లా పేరులో మార్పులు దారుణం

ప్రజాశక్తి - కడప : వైఎస్ఆర్ జిల్లా పేరులో మార్పులు చేయడం దారుణమని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంటే ఒక బ్రాండ్, ఆయన పేరు చెప్పగానే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ఏకైక వ్యక్తి అన్నారు. ఆయన అకాల మరణంతో వందలాది మంది అభిమానులు, కార్యకర్తలు మృతి చెందారు అన్నారు. ప్రజలు ఎన్నడు చూడని పథకాలను ప్రజలకు అందించిన గొప్ప వ్యక్తి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన మరణం తర్వాత ప్రజలకు గుర్తుగా జిల్లాకు అప్పటి ప్రభుత్వం ఆయన పేరు పెట్టారని తెలిపారు.కూటమి ప్రభుత్వం జిల్లా పేరులో వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్పులు చేయడం దురదృష్టకరం అని అన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు బిహెచ్ ఇలియాస్, పులి సునీల్ కుమార్, కరిముల్లా, షఫీ, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌సి కాలనీలో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక పంచాయతీలోని ఎస్‌సి కాలనీలో ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. గురువారం టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్.సి. జయ రామిరెడ్డి ఆధ్వర్యంలో ట్యాంకర్లు పెట్టి తాగునీటిని సరఫరా చేశారు. బోర్లులో నీటి శాతం తగ్గి పోవడంతో వేంపల్లెలోని ఆయా ప్రాంతాలకు సకాలంలో తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో కాలనీ వాసులు సమస్యను టిడిపి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. టిడిపి జిల్లా కార్ధయర్శి ఆధ్వర్యంలో కాలనీ ప్రజలందరికీ తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందించారు. రోజూ ట్యాంకర్లుతో నీటిని సరఫరా చేస్తామని టిడిపి నేత శివ కృష్ణారెడ్డి తెలిపారు. నీటి ఎద్దడి లేకుండా చేయాలని ఇప్పటికే బిటెక్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆర్ డబ్ల్యుఎస్ కింద బోర్లు వేసేందుకు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి ఆదిత్యారెడ్డి, కమటం హరికుమార్ రెడ్డి, కంతూరి వెంకటేష్, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

విధుల్లో పట్టు సాధించాలి

ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా పోలీస్ శాఖలోని సిబ్బంది జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం (డిటిసి)లో నిర్వహించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని, దైనందిన విధి నిర్వహణలో మరింత ప్రభావవంతంగా పనిచేయాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం నగర శివార్లలోని డిటిసిలో అత్యాధునిక ఇ-క్లాస్ రూమ్‌ను ప్రారంభించారు. పూర్తిగా ఎయిర్ కండిషన్డ్ చేసిన ఇ-క్లాస్ రూమ్‌లో శిక్షణార్థులకు ఉపయోగపడేలా అధునాతన ప్రొజెక్టర్, ఇతర పరికరాలు, వసతులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాటాడుతూ ఉద్యోగ జీవితంలో ఎప్పటికప్పుడూ అప్ డేట్‌గా ఉంటూ వివిధ అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన ఫ్యాకల్టీతో నిర్వహించే శిక్షణ విధి నిర్వహణలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శిక్షణలో భాగంగా భవిష్యత్తులో ఉపయుక్తంగా ఉండేలా రూపొందించిన మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇ-క్లాస్ రూమ్‌ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీంను ప్రత్యేకంగా అభినందించారు. శిక్షణా తరగతుల్లో భాగంగా పోలీస్ సిబ్బందికి భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ న్యాయ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఎ)లపై సంబంధిత విషయం పరిజ్ఞానం ఉన్న నిపుణులు పోలీస్ సిబ్బందికి కూలంకషంగా వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్‌పి (ఎఆర్) బి.రమణయ్య, డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం, ఎఆర్ డిఎస్‌పి కె.శ్రీనివాస రావు, డిటిసి ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్ కుమార్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు టి.రెడ్డెప్ప, దారెడ్డి భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్‌పి అశోక్ కుమార్

పరిశోధనే లక్ష్యంగా ముందుకు రావాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ రఘునాథ రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

యువ పరిశోధకులు బలమైన కాంక్షతో పరిశోధనే లక్ష్యంగా ముందుకు రావాలని శాస్త్ర పరిశోధనలో విస్తృత అవకాశాలు ఉన్నాయని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఎఫ్ ఎన్ఎ ఫెలో ఆఫ్ నేషనల్ అకాడమీ ఆచార్య ఎ.ఎస్. రాఘవేంద్ర స్పష్టం చేశారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (బెంగళూరు), ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (న్యూఢిల్లీ), నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా (ప్రయాగ్‌రాజ్) ఆధ్వర్యంలో 'జీవశాస్త్రంలో కమ్యూనికేషన్ వ్యవస్థలు' అనే అంశంపై లెక్చర్, వర్క్‌షాప్ విశ్వవిద్యాలయ లోని తాళ్లపాక అన్నమాచార్య సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఆచార్య ఎ.ఎస్. రాఘవేంద్ర మాట్లాడుతూ సైంటిఫిక్ లెక్చర్స్ పైన విద్యార్థులు స్కాలర్లు దృష్టి సారిస్తే సైన్స్ అకాడమీలు సహకారం అందిస్తాయన్నారు. 10 శాతం వరకు పరిశోధనల వైపు యువత రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రారంభ సభకు విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ కమ్యూనికేషన్ వల్ల జీవులు జీవిత నైపుణ్యాలను నేర్చుకోవడంలో సహాయపడుతుందని చెప్పారు. వివిధ జాతుల మధ్య కమ్యూనికేషన్ పర్యావరణ సమతుల్యతను నిర్వహించడంలో సహాయపడుతుందన్నారు. కమ్యూనికేషన్ సహజీవన సంబంధాలను సులభతరం చేస్తుందని తెలిపారు. అతిథి కుల సచివులు ఆచార్య పి. పద్మ మాట్లాడుతూ స్పెసిలైజేషన్లు ఉన్నత స్థాయిలో అధ్యయనం, పరిశోధనలను పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. జాతీయ విద్యా విధానం-2020 కూడా ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. వ్యాధుల నిర్ధారణ, చికిత్స, ఔషధం అభివృద్ధిలో వ్యవసాయం, పర్యావరణ స్థిరత్వం అంశాలలో సహాయపడుతుందన్నారు. కో- ఆర్డినేటర్ డాక్టర్ వి.రామకృష్ణ కార్యక్రమాన్ని సమన్వయం చేయడంతో పాటు విశ్వవిద్యాలయము పరిశోధనలపరంగా, విద్యార్థులను పరిశోధకులను ఆ దిశగా పయనింపజేసేలా ముందుకు వెళ్తోందని వివరించారు. ఆచార్య రాఘవేంద్ర 'ప్లాంట్ అడాప్షన్ టు ఎన్విరాన్మెంటల్ స్ట్రెస్' పై సైంటిఫిక్ ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో పరిశోధకులు విద్యార్థులు స్కాలర్లు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

అసెంబ్లీ లోనీ సిఎం ఛాంబర్‌లో కడప జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస రెడ్డితో పాటు ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి జిల్లా అభివృద్ధి పై చర్చించారు. నిధులు, అభివృద్ధి పనులపై, తాగునీటి సమస్య వంటి వాటి గురించి సిఎంకు వివరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలు ఆర్.మాధవి రెడ్డి, చైతన్య రెడ్డి, వరదరాజులురెడ్డి, ఆరవ శ్రీధర్, మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, వైఎస్ఆర్ జిల్లాగా ఉన్న పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధికి సహకరించాలని సీఎం చంద్రబాబు నాయుడును విజ్ఞప్తి చేశారు. మేలో నిర్వహించబోయే మహానాడు కార్యక్రమం ఏర్పాట్లపై చర్చించారు.



సిఎంతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

మైనార్టీలను విస్మరించిన సిఎం చంద్రబాబు

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌షా

ప్రజాశక్తి - కడప

ఇంత కష్టపడి సాధించిన ఎంబార్కేషన్ పాయింట్‌ను తీసేయడం బాధాకరమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. ఇది కేవలం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం మాత్రమే అన్నారు. మైనార్టీ వర్గాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి విజయవాడ నుండి ఎంబార్కేశన్ పాయింట్ తొలగించారు అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో ఎంతో ప్రయాసలతో, కష్టపడి ఇక్కడ పాయింట్ సాధించామని చెప్పారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల విజయవాడలో పాయింట్ తొలగించారన్నారు. గతంలో మన రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లాలంటే వేరే ప్రాంతాల నుంచి వెళ్లే వారని చెప్పారు. 2019లో కూడా హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హాజీలు యాత్రకు వెళ్లారని, అప్పట్లో తెలంగాణ ప్రభుత్వం మన రాష్ట్ర హాజీలకు సరైన సదుపాయాలు కల్పించలేదని అన్నారు. ఆ తర్వాత మన రాష్ట్రం నుండే హాజీలను హజ్ యాత్రకు పంపించాలని అప్పటి సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి 2020లో మన రాష్ట్రం విజయవాడ నుంచి ఎంబార్కేషన్ పాయింట్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. కరోనా నేపథ్యంలో రెండేళ్లు హజ్ యాత్ర జరగలేదు అన్నారు. 2023 లో కేంద్ర ప్రభుత్వానికి అప్పటి వైసీపీ ప్రభుత్వం లేఖ రాయడం జరిగింది అన్నారు.2023లో మన రాష్ట్రం నుండి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1813 మంది హజ్ యాత్రకు వెళ్లారు అని తెలిపారు. అదనపు భారాన్ని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ఉత్తర్వులు జారీచేసింది అని తెలిపారు. విలేకరుల సమావేశంలో మాజీ హజ్ కమిటీ ఛైర్మన్ గౌసులాజం, మాజీ ఛైర్మన్ కరిముల్లా, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాఫుల్లా, కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ, అస్మతుల్లా, నార్త్ జోన్ అధ్యక్షులు బిహెచ్ ఇలియాస్, జిల్లా కార్యదర్శి చాంద్ బాషా, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు వైస్ ఛైర్మన్ రిజ్వాన్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ఇబ్రహీం, నాయకులు రాయల్ బాబు, చాంద్ అలీ,సలీం సాహెబ్, భాన్న ఉన్నారు.

ఉర్దూ ఉన్నత విద్యా సంస్థలను పటిష్టపరచాలి : రూట

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా దశాబ్ద కాలం నుంచి ఉర్దూ ఉన్నత విద్యను నామమాత్రంగా నిర్వహిస్తున్నట్లు స్పష్టంగా అర్థం అవుతుందని, ఇది రాష్ట్రంలోనీ మైనారిటీ వర్గాల ఉర్దూ విద్యార్థులకు అన్యాయం చేయడమే అని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ (రూట, ఏపి) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్ , ముష్తాఖ్ హుసేన్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఉర్దూ విభాగం తాత్కాలికంగా ఏర్పాటు చేసి దాదాపు దశాబ్ద కాలం గడుస్తున్నప్పటికీ ఉర్దూ డిపార్ట్‌మెంట్ రెగ్యులర్ చేయడం, అధ్యాపకుల పోస్టులు మంజూరు చేయలేదని తెలిపారు. అక్కడ చదువుతున్న పీజీ విద్యార్థులకు పరిశోధన కోసం పిహెచ్‌డి అవకాశం లేకుండానే కాలం గడుపుతున్నారని, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు కర్నూలు, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కర్నూలులో ఏర్పాటు చేసిన ఉర్దూ విశ్వవిద్యాలయంలో కేవలం అకాడమిక్ కన్సల్‌టెంట్, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీలతో ఉన్నత కోర్సులన్నీ నిర్వహిస్తున్నారని చెప్పారు. మంజూరై భర్తీకి నోచుకోని అధ్యాపక పోస్టులను ఉర్దూ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గం మంగళగిరి సమీపాన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభించి మూడు సంవత్సరాలైన రెగ్యులర్ చేయలేదని పేర్కొన్నారు. తాత్కాలికంగా కేవలం గెస్ట్ ఫ్యాకల్టీలతో నిర్వహిస్తున్నారని, ఒక్క ప్రొఫెసర్ పోస్ట్ కూడా మంజూరు చేయలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 17 సంవత్సరాల నుంచి 10 ఉర్దూ జూనియర్ కళాశాలలలో ఒక్క లెక్చరర్ పోస్ట్ కూడా మంజూరు చేయకుండా గెస్ట్ ఫ్యాకల్టీ, కాంట్రాక్టు లెక్చరర్ల ద్వారా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇటు నిరుద్యోగ ఉర్దూ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా, అటు ఉర్దూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా కాలం గడుపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కటి కూడా ప్రభుత్వ యునాని మెడికల్ కళాశాల లేకపోవడం వోచనీయమని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న యునాని మెడికల్ ఆఫీసర్ల పోస్టులు భర్తీచేయాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఇక్బాల్


ఆర్‌డిఒతో మాట్లాడుతున్న ధ్రువకుమార్‌రెడ్డి

ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ చేయాలి

ఆర్‌డిఒతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గం, మున్సిపాలిటీ, మండల ప్రజలకు ఇంటి వద్దనే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఆర్‌డిఒ చెన్నయ్యను కోరారు. ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు అనిల్‌కుమార్ రెడ్డి ఆర్‌డిఓను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలపై చర్చించారు. రేషన్ బియ్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఇంటి వద్ద లబ్ధిదారులకు ఇస్తున్నారని, పులివెందుల నియోజక వర్గంలోనే అలా చేయడంలేదని తెలిపారు. దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒను కోరారు. డికెటి పట్టాలకు సంబంధించి పేదలను బినామీగా పెట్టుకుని ధనికులు ప్రభుత్వ భూములను సొంతం చేసుకుంటున్నారని ఆరోపించారు. వీటిని పరిశీలించాలన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో చాలాచోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. ఇందుకు ఆర్‌డిఒ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ బిసి నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

నేడు గుడిపాడులో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని గుడిపాడులో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి డాక్టర్ రామయ్య ఆసుపత్రి వద్ద ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎంపి రామమోహన్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన అభిలాష్ నేత్ర వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.గురుమూర్తి, డాక్టర్ గురుఅభిలాష్ హాజరవుతున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు తీసుకరావాలని నిర్వాహకులు సూచించారు.


మూతపడిన శుద్ధినీటి కేంద్రం

శుద్ధి జలం.. ప్రజలకు అందనంత దూరం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి కుటుంబానికి శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన శుద్ధి నీది కేంద్రం నిరుపయోగంగా మారింది. పట్టణంలోని ఇబిసి కాలనీలో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఆర్థిక సహకారంతో శుద్ధి నీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తద్వారా సామాన్య ప్రజానీకానికి తక్కువ ధరలో మంచినీరు లభించేది. ప్రారంభంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ వచ్చింది. అనంతరం కొద్ది కాలానికి శుద్ధినీటి కేంద్రాన్ని మూసేశారు. కాలనీలోని ప్రజలు శుద్ధి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఒక్కో క్యాన్ మంచినీరు రూ.20 వరకు అమ్ముతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు స్పందించి శుద్ధి నీటి కేంద్రాన్ని మళ్లీ ప్రారంభించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కృష్ణమూర్తి సూచించారు. గురువారం మండలంలోని కోరగుంటపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండగలుగుతారన్నారు. తడి పొడి చెత్త డబ్బాలను ఉపయోగించాలన్నారు. తాగునీరు, ఇతర సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా తాగు నీరు ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రాజశేఖర్ పాల్గొన్నారు.


చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణమూర్తి


క్రైం కార్నర్

కుమ్మరాంపల్లెలో చోరీ

బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామ సమీపంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయం పక్కన ఇంటిలో చోరీ జరిగింది. మాజీ సర్పంచ్ రామాంజనేయరెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇంటిలో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.7.50లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. గురువారం బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్ టీం తనిఖీలు నిర్వహించింది. ఇంట్లో ఉన్న పలు రకాల వస్తువులపై ఉన్న వేలిముద్రలను క్లూస్ టీం అధికారులు సేకరించారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. కుమ్మరాంపల్లె గ్రామ సమీపంలో నివాసం నివాసం ఉండగా వేంపల్లి పులివెందుల రోడ్డులో మధుసూదన్‌రెడ్డి, ఆయన భార్య మౌనిక దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నారు. వీరు ప్రతిరోజు ఉదయం 8 గంటలకు వేంపల్లికు వచ్చి వ్యాపారం చేసుకొని రాత్రి 8 గంటలకు ఇంటికెళతారు. పిల్లలను కూడా వేంపల్లిలోనే చదివించుకుంటున్నారు. రోజు మాదిరే ఉదయం 8 గంటలకు వేంపల్లెకు భార్యభర్తలు వచ్చారు. సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి పోయి చూడగా బీరువా పగలగొట్టి బట్టలను చిందరవందరగా వేసినట్లు తెలిపారు.వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు సిఐ సురేష్ రెడ్డి తెలిపారు.


వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం అధికారులు

పుట్టగొడుగుల్లా అనుమతుల్లేని వెంచర్లు


చాపాడు హైస్కూల్ సమీపం వెంచర్‌లో ఏర్పాటు చేస్తున్న రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో అనుమతులు లేని వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు చేసుకుంటూ చలనాలు చెల్లించడం అధికారులు పరిశీలించక ముందే ఆ ప్రాంతాల్లో పనులు చకచక పూర్తి చేస్తున్నారు. మండల కేంద్రమైన చాపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో నూతనంగా లే అవుట్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే రోడ్లు, పైపులైన్, ప్రహరీ వంటి ఏర్పాట్లు చేపట్టారు. దీంతోపాటు తహశీల్దార్ కార్యాలయం సమీపంలో, పల్లవోలులో కూడా పలు వెంచర్లు వెలిశాయి. ప్రహరీలు ఏర్పాటు చేసి ప్లాట్ల రాళ్లను ఏర్పాటు చేయడం, అమ్మకాలు చేపడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రజలు వాటిని కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్నారు. అనుమతులు లేని వెంచర్లలో ప్రజలు చలానాలు అధికంగా చెల్లించి ఇళ్లు నిర్మించుకోవాల్సిన పరిస్థితి. వెంచర్లు ఏర్పాటు చేసేవారు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదు. గ్రామపంచాయతీకి 10 శాతం స్థలాన్ని రిజిస్టర్ చేయాల్సి ఉంది. అలాంటి నిబంధనలు ఏమాత్రం పాటించడం లేదు. వెంచర్లు ఏర్పాటు చేయడం, అమ్మకాలు సాగించడం ఆ తర్వాత తమకు తెలియనట్లుగా మిన్నకుండడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేని లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనుమతుల్లేని వాటికి నోటీసులు

మండల పరిధిలో అనుమతులు పొందకుండా గృహ నిర్మాణాలకు లే అవుట్ ఏర్పాటు చేసిన యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. చాపాడులోని అనుమతులు లేని లే ఔట్లను పంచాయతీ సిబ్బందితో కలిసి పరిశీలించాం. చాపాడు, పల్లవోలులో అనుమతులు లేకుండా కొంతమంది లే ఔట్ లను ఏర్పాటు చేశారు. గతంలో నోటీసులు జారీ చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లే అవుట్ యజమానులకు మళ్లీ నోటీసులు జారీ చేస్తాం

- రాధాకృష్ణవేణి, ఇఒపిఆర్‌డి, చాపాడు

ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కృషి


అంగన్వాడీలకు సూచనలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్

ప్రజాశక్తి - వేంపల్లె

అంగన్‌వాడీ కేంద్రాలను పౌష్టికాహార కేంద్రాలుగా మాత్రమే కాకుండా విద్యాకేంద్రాలుగా కూడా మార్చే లక్ష్యంగా అంగన్వాడీ కార్యకర్తలు పని చేయాలని సూపర్‌వైజర్ స్వర్ణలత పేర్కొన్నారు. వేంపల్లె ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ, పడాయి భీ అనే కార్యక్రమంలో భాగంగా గురువారం స్వర్ణలత, హసీనా ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ప్రారభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి చిన్నారికి ప్రతిరోజూ కనీసం రెండు గంటల పాటు నాణ్యత గల ప్రీ-స్కూల్ బోధన అందించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రీ స్కూల్ కార్యక్రమాల ద్వారా నాణ్యమైన విద్యను అందించే అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరత్న, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : అంగన్వాడీ స్థాయిలోనే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలు పెంచాలని చాపాడు సెక్టర్ సిడిపిఒ సావిత్రమ్మ సిబ్బందికి సూచించారు. పోషన్ భీ పదాయ్ భీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కార్యాలయంలో శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ విద్యార్థుల్లో నాణ్యత ప్రమాణాలు పెంపొందించేందుకు అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇప్పిస్తుందన్నారు. సున్న నుండి మూడు సంవత్సరాల పిల్లలకు ఆధార్ నవచేతన, మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు వారికి ఆధార్ శీలా పేరుతో కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. పిల్లల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంతో అంగన్వాడీ కేంద్రాలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, సౌజన్య, ప్రత్యుష, శారదమ్మ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **మైదుకూరులో...** ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీదేవి అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పదాయ్ భీ మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు జె.ప్రశాంతి, కె.ఓబుళమ్మ, జె.శ్రీదేవి పాల్గొన్నారు.

ఖాజీపేట : అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో గురువారం అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ.. పడాయి భీ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి, జహరాభి, రమాదేవి, ప్రదమ్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ నరసింహులు పాల్గొన్నారు.

కార్డుదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రేషన్‌కార్డు లబ్ధిదారులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని నిడివెలగల గ్రామంలో గురువారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,385 మంది రేషన్ కార్డుదారులు ఇకెవైసి చేయించుకోలేదన్నారు. లబ్ధిదారులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల రేషన్ డీలర్ల వద్ద చేయించుకోవాలని కోరారు. రెవెన్యూకు సంబంధించిన ఇతర అంశాలను వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గేట్‌లో రాణించిన విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గేట్-2025 పరీక్షల్లో అద్భుత ప్రతిభను కనబరిచి ర్యాంకులు సాధించినట్లు ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో గెట్-2025 పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లో దాదాపు 400 మంది విద్యార్థులు ఐఐటికి నిర్వహించిన గేట్ పరీక్షల్లో అద్భుత ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. వారిలో 30 మందిపైగా విద్యార్థులు 1000 లోపు ర్యాంకులు సాధించడం విశేషమన్నారు. నూజివీడు క్యాంపస్‌కు చెందిన ఆశోక్ అమ్మిరెడ్డి కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో అఖిల భారత స్థాయిలో 12వ ర్యాంకు సాధించి విశ్వవిద్యాలయానికి గొప్ప పేరు ప్రతిష్ట తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్, డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ అకడమిక్స్ రమేష్ కైలాస్, ఆయా విభాగాల హెచ్‌ఒడిలు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - ముద్దనూరు

ఉపాధి హామీకి సంబంధించి మండల వ్యాప్తంగా జరిగిన పనులు, చెల్లింపులు పరిశీలించనున్నట్లు స్టేట్ రీసోర్స్ పర్సన్ కాతయ్య తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో గురువారం ఎస్ఆర్ పి కాంతయ్య ఆధ్వర్యంలో ముద్దనూరు ఎపిఒ గంగయ్య ఉపాధి సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు కూలీల ఖర్చు రూ.7.26 కోట్లు, మెటీరియల్ రూ.3.19 కోట్లు మొత్తం రూ.10.46కోట్లు చెల్లింపులు జరిగినట్లు చెప్పారు. శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు గ్రామ పంచాయతీల వారీగా క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీలా వారీగా నివేదికను తయారు చేయనున్నట్లు తెలిపారు. సోషల్ ఆడిట్ 19వ రౌండ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ భవనాలు, గృహ నిర్మాణాలు, పండ్ల తోటల పెంపకానికి సంబంధించి పనులు జరిగినట్లు తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉండి పంచాయతీలో పనులన్నిటిని చూపించాలని డిఆర్ శ్రీనివాసులు, హరీంద్ర సిబ్బందికి సూచించారు.

సరుకులు వితరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా విభిన్నప్రతిభావంతుల సేవ సమితి ఆధ్వర్యంలో రంజాన్ మాసం పురస్కరించుకొని 25 మంది విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు రంజాన్ తోఫా స్థానిక మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ చాపాడు మండలం మడూరు గ్రామానికి చెందిన కట్టుబడి అబ్దుల్ రసూల్ కుమారులు మహబూబ్ బాషా, చాంద్ భాషా సహకారంతో అబ్దుల్ రసూల్ జ్ఞాపకార్థం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యంగుల సేవా సమితి సభ్యులు రమీజా, ఖాజా, వెంకటలక్ష్మి, మున్నూరు బాషా, ఆసిఫ్, పవన్ పాల్గొన్నారు.



రక్తదానం కార్యక్రమంలో యాజమాన్యం

రక్తదానంలో యువత ముందుండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రక్తదానం చేయడంలో యువత ముందుండాలని తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని శ్రీ షిరిడి సాయి డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. రోడ్డు ప్రమాదాల్లో, ఇతర అత్యవసర సయాల్లో మరొకరి ప్రాణదాతలు అవుతారన్నారు. కళాశాల డైరెక్టర్ కె.సంజీవరెడ్డి మాట్లాడుతూ 38 మంది రక్తదానం చేశారన్నారు. కళాశాల యాజమాన్యం తహశీల్దార్‌ను సన్మానించింది. కార్యక్రమంలో ప్రొద్దుటూరు సురక్ష బ్లడ్ బ్యాంక్, కళాశాల కరస్పాండెంట్ హైమావతి, డైరెక్టర్ సంజీవరెడ్డి, ప్రిన్సిపల్ సుదర్శనమ్మ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ద్వారకానాథ్‌రెడ్డి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక పోలీసు క్వార్టర్స్ ఆవరణలో గురువారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దువ్వూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దువ్వూరు పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపై ఎంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బ్యాంకు మేనేజర్ శ్యామ్ మాట్లాడుతూ ఎవరైనా తాము బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నాం.. మీ ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, ఒటిపి చెప్పమని అడిగితే మీరు చెప్పవద్దన్నారు. విభూది బ్రదర్స్ వారిచే కళాజాత కార్యక్రమం నిర్వహించి ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసులు, బ్యాంకు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కడప ఉక్కు.. ఆంధ్రుల హక్కు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప ఉక్కు.. ఆంధ్రుల హక్కు కరపత్రాన్ని గురువారం సిపిఎం నాయ కులు విడుదల చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 26న కడప ఉక్కు ఆంధ్రుల హక్కు సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు సంబం ధించిన కరపత్రం విడుదల చేశామన్నారు. బిజెపి మూడో సారి అధికారంలోకి వచ్చి రాష్ట్రం విడిపోయే సందర్భంగా కడప జిల్లా స్టీల్‌ప్లాంట్, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకహోదా తదితర వాటిని పొందు పరిచిందన్నారు. సదస్సులో నిరుద్యోగులు, మేధా వులు, వ్యాపారస్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. డివైఎఫ్ఐ కార్య దర్శి విశ్వనాథ్, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు, లక్ష్మయ్య, బాలసుబ్బయ్య, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు శివకుమార్

23న పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్వాతంత్ర సమరయోధులు, యువతకు స్ఫూర్తి ప్రదాతలైన భగత సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23న దేశ స్వాతంత్రం కోసం ఉరికొయ్యను ముద్దాడిన వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లాలో వారి ఆశయాల సాధనకు కృషి చేస్తామని ప్రతినపూని సభలు, శ్రమదానాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిస్తున్నామన్నారు. సమావేశంలో ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, పట్టణ సహాయ కార్యదర్శి రవితేజ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

గుండెపోటుకు కారణం ఆహారపు అలవాట్లే

ప్రజాశక్తి - వేంపల్లె

ఆహారపు అలవాట్లు వల్ల చాలా మంది ఎక్కువగా గుండెపోటుతో మరణిస్తున్నారని, అవగాహన లేకపోవడంతో ఇలా జరుగుతోందని కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. అవగాహన పెంచుకొంటే మరణాలు తగ్గే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలిపారు. స్థానిక ఎస్ఎఫ్ బాషా హాస్పిటల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుండెపోటులో నొప్పి తీవ్రంగా, నిరంతరంగా ఉండి, ఛాతీతోపాటు ఎడమ చేయి, మెడ, దవడ వైపుకూడా వ్యాపిస్తుందని పేర్కొన్నారు. గుండెపోటు నొప్పి వల్ల శ్వాస ఆడకపోవడం, ఒత్తిడి, బరువు, చెమటలు పట్టడం, తల తిరగడం వంటి అదనపు లక్షణాలు కనిపిస్తాయన్నారు. త్వరలోనే వేంపల్లెలో డాక్టర్ ఎస్ఎఫ్ బాషా సహకారంతో ఉచిత గుండె చిక్సిత శిబిరాన్ని ఏర్పాటు చేస్తానని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, డాక్టర్ కరీముల్లా పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ వీర కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని రాణించాలన్నారు. నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలను ప్రధానోపాధ్యాయులు అన్ని రకాల వసతులతో అందుబాటులో ఉంచారన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఆయన ఏర్పాట్లు చేపట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ రవిశంకర్, వంశీకృష్ణ, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శోభన్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న హౌసింగ్ డిఇ రమణారెడ్డి

ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - వేముల

ఇళ్ల నిర్మాణంలో పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థికసాయం అందిస్తోందని హౌసింగ్ డిఇ రమణారెడ్డి తెలిపారు. వేముల హౌసింగ్ కార్యాలయంలో డిఇ గురువారం మండలంలోని ఇంజినీర్ అసిస్టెంట్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అదనపు ఆర్థికసాయం సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా హౌసింగ్ పథకం కింద 101 ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులున్నారని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు అర్హతగల లబ్ధిదారుల ఇంటికెళ్లి అదనపు ఆర్థికసాయం గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.